
సాక్షి
ఒడిశా
సోమవారం। 9। అక్టోబర్। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

| | |
|---|---|
| నగదు | రూ.6,03,233 |
| బంగారం | 8 గ్రాముల 600 మిల్లీ గ్రాములు |
| వెండి | 159 గ్రాముల 500 మిల్లీ గ్రాములు |

- భువనేశ్వర్/పూరీ



సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

- 8లో

బహు రూపాల్లో శక్తి స్వరూపిణి



షోడశ ఉపచార పూజలు పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ శక్తి పీఠాల్లో ఆరాధ్య దేవతలు బహు రూపాల్లో ఆదివారం దర్శనమిచ్చారు.

- 8లో

## న్యూస్‌రీల్

### అన్ని రంగాల్లో మహిళల ముందంజ



మాట్లాడుతున్న ఒడియా సాహిత్య అకాడమీ సభ్యుడు బిచిత్రానంద బెబర్తా

పర్లాకిమిడి: నారీ స్వశక్తీకరణతో మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శతపతి అన్నారు. స్థానిక యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో ప్రగతి మహిళా సంఘటన్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకారాగారము సూపరింటెండెంట్ హేను శెఠి హాజరవ్వగా గౌరవ అతిథులుగా ఒడియా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రా నంద బెబర్తా, లోకనాథ మిశ్రా తదితరులు హాజరై నారీశక్తిపై హాజరయ్యారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా డ్వాక్రా గ్రూపులు, మిషన్ శక్తి వంటి పథకాలలో చేరి తమ స్వంత కాళ్ల మీద జీవించడం ఎంతైనా అవసరమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నర్సింగ గౌడో, హరిమోహన్ పట్నాయక్, తిరుపతి పండా తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన వ్యక్తి

రాయగడ: ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్, పికప్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీ దమలిమ్మ గ్రామ సమీపంలో శనివారం రాత్రి ప్రమాదం జరిగింది. కల్యాణసింగుపూర్ నుంచి ఇనుప రాడ్ల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టరులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పికప్ వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

### నేటి నుంచి ట్రాక్ పునరుద్ధరణ



కేకే రైల్వేలైన్‌లో ట్రాక్‌పై మిగిలిన మట్టి

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వేమార్గంలో సోమవారం నుంచి రైల్వేట్రాక్ పునరుద్ధరణ కానుంది. ఆదివారం సాయంత్రంకి దాదాపు మట్టి తొలగింపు అత్యధిక శాతం పూర్తయింది. గత సెప్టెంబర్ 24వ తేదీన కొత్తవలస–కిరండోల్ రైల్వేమార్గంలో కొరాపుట్ సమీపంలో మనబార్–జంత్రి స్టేషన్ల మధ్య మట్టి కొండలు ట్రాక్ మీదికి చొచ్చుకొచ్చాయి. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. నాటి నుంచి సుమారు 30 జేసీబీలు రాత్రింబవళ్లు మట్టి తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నాయి. సుమారు 230 మీటర్ల ట్రాక్ వరకు మట్టితో నిండిపోయింది. మట్టి తొలగింపు చివరి దశకి చేరుకుంది. అర్థరాత్రి ట్రాక్ పరిశీలన, సోమవారం ఉదయం విద్యుదీకరణ పరిశీలన చేస్తారు. అనంతరం ట్రయిల్ రన్ జరుగుతుంది. అయితే రైళ్ల పునరుద్ధరణ కోసం ఇంకా తేలాల్సి ఉంది. ఈ మార్గంలో గూడ్స్ రవాణా వలన ప్రతిరోజూ సుమారు రూ.50 కోట్లు ఆదాయం వస్తుండేది. ప్రస్తుత ఘటన వలన వాల్తేర్ డివిజన్‌కి సుమారు రు.750 కోట్లు నష్టం వచ్చింది. అయితే ఇంకా కొండ మీద నుంచి నీరు కిందకి వస్తుండడం రైల్వే అధికారులకు ఆందోళన కలిగిస్తోంది. ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, వాల్తేర్ డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్‌లు ఇప్పటికే ఈ ప్రాంతాన్ని క్షేత్ర పరిశీలన చేశారు.

# ఏ తల్లి కన్న బిడ్డలో..!

- బహనాగా విషాదంలో గుర్తింపులేని మృతదేహాలు
- శీతల కంటైనర్‌లో మగ్గుతున్న 28 పార్థివ దేహాలు
- శాస్త్రీయంగా సంస్కరించాలని నిర్ణయం



శవాలు భద్రపరచిన శీతల పేటిక

భువనేశ్వర్: ఈ ఏడాది జూన్ నెలలో సంభవించిన ఘోర బహనాగా రైలు దుర్ఘటన అంశం మరోసారి తెరకెక్కింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సీబీఐ చొరవ కల్పించుకుంది. మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఎవరూ రాని పరిస్థితుల్లో శీతల శవ పేటికలో మగ్గుతున్న దేహాలను శాస్త్రీయ రీతిలో అంత్యక్రియలు చేపట్టాలని లేఖ రాసింది. ఈ లేఖతో అనుబంధ యంత్రాంగం కదిలింది. ఈ దుర్ఘటనలో గుర్తింపు పొందని శవాలను స్థానిక ఎయిమ్స్ ప్రత్యేక శీతల కంటైనర్లలో భద్రపరిచింది. ఈ పేటికలో 28 మృత దేహాలు అప్పటి నుంచి మగ్గుతున్నాయి. వీటిని తొలగించేందుకు స్థానిక నగరపాలక సంస్థ బీఎంసీ ఆదివారం నిర్ధారిత కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ) జారీ చేసింది. మృతదేహాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని ఖుర్దా జిల్లా కలెక్టర్‌కు సీబీఐ లేఖ రాయడంతో, బీఎంసీ ఈ ప్రక్రియకు నడుం బిగించింది.

**వాహనాలు సమకూర్చనున్న బీఎంసీ**

ఎయిమ్స్ నుంచి శ్మశానవాటికకు సాఫీగా రవాణా చేయడానికి రెండు నుంచి మూడు మృతదేహాల రవాణా వాహనాలను బీఎంసీ అందిస్తుంది. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ ఎయిమ్స్ డైరెక్టర్ మృతదేహాలను దహన సంస్కారాల కోసం బీఎంసీ ఆరోగ్య శాఖ అధికారికి అప్పగిస్తారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మరియు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ప్రస్తుత నియమాలు మరియు మార్గదర్శకాలను అనుసరించి దహన సంస్కారాల కోసం అనుబంధ వర్గాలకు అందజేయాల్సి ఉంటుంది. నిర్ధారిత కార్యాచరణ విధానం ప్రకారం మృతదేహాలను స్వీకరించడం నుంచి దహన సంస్కారాల వరకు సమగ్ర ప్రక్రియ వీడియో రికార్డింగ్ చేయబడుతుంది. మరో రెండు రోజుల్లో మృతదేహాలను బయటకు తీయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

**ఎయిమ్స్‌లో మృతదేహాలు**

బహనాగా బజారు రైలు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి బంధుమిత్రులు, ఆత్మీయులు ముందుకు రాకపోవడంతో భద్రంగా పదిలపరిచేందుకు 162 మృతదేహాలను స్థానిక ఎయిమ్స్‌కు తరలించారు. తొలి దశలో 81 మందిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బహుళ హక్కుదారులు మరియు కొన్ని ఇతర సమస్యల కారణంగా దాదాపు 100 మృతదేహాలు మరియు ముందుకు వచ్చిన హక్కుదారుల డీఎన్‌ఏ నమూనాలను సరిపోల్చడానికి న్యూఢిల్లీకి పంపారు. డీఎన్‌ఏ పరీక్ష ఫలితాల ఆధారంగా రెండో దశలో మరో 52 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. ఈ లెక్కన ఈ ఏడాది ఆగస్టు 1 వరకు 29 మృతదేహాలు తీసుకునేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. సెప్టెంబర్ నెలలో మరో మృతదేహం అప్పగింత ప్రక్రియ ముగియడంతో ఈ సంఖ్య 28కి తగ్గింది. మిగిలిన మృత దేహాల కోసం ఆస్పత్రికి ఎవరూ రాలేదని ఎయిమ్స్ భువనేశ్వర్ సూపరింటెండెంట్ దిలీప్ పరిడా మీడియాకు తెలిపారు. దీర్ఘకాలం ఈ మృతదేహాలు కుళ్లిపోకుండా భద్రపరిచేందుకు పారాదీప్ పోర్టు ట్రస్టు నుంచి ఎయిమ్స్ ప్రత్యేక శీతల (డీప్ ఫ్రీజర్) శవ భద్రత పేటికలను అందుబాటులోకి తెచ్చిందని వివరించారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



పోటీల్లో పాల్గొనేందుకు హాజరైన విద్యార్థులు

- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా క్రీడా విభాగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలియజేశారు. క్రీడలపై ఆసక్తి కనబరిచే విద్యార్థులకు ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై సైతం దృష్టి సారించాలని సూచించారు. గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి గొమాంగోలు మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నామని తెలియజేశారు. రెండు రోజుల పాటు జరగనున్న క్రీడల్లో రాణించే విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం లభిస్తుందని జిల్లా క్రీడా శాఖ అధికారి షేక్ ఆలీనూర్ తెలియజేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యే గొమాంగో తదితరులు

## పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు

- ఎంపీ చంద్రశేఖర్ సాహు

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ ఎంపీ చంద్రశేఖర్ సాహు కోరారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాల రోడ్‌లోని గంజాం జిల్లా బీజేడీ కార్యాలయంలో జిల్లాస్థాయి బీజేడీ నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి పంచాయతీలో పార్టీ పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బ్లాక్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. సమావేశంలో బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, మాజీ చైర్మన్ పి.భీముడు, బీజేడీ జిల్లా వైస్ చైర్మన్ బిజయ్ సామల్, భగవాన్ గొంతాయత్, జెడ్పీ చైర్మన్ సుభాష్ బెహరా తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీజేడీ నాయకులు

## చండీఘర్ టూర్‌కు గిరిజన యువత



చండీఘర్ బయల్దేరుతున్న యువతతో బీఎస్ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ 3 గ్రామం వద్దనున్న బీఎస్ఎఫ్ క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం 20 మంది గిరిజన యువతకు చండీఘర్ ప్రయాణానికి అవకాశం కల్పించారు. బీఎస్ఎఫ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మత్తిలి సమితి పరిధిలో ఉన్న పలు గిరిజన గ్రామాల యువతకు ప్రపంచం గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో టూర్‌కు తీసుకెళ్లారు. దీనిలో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యువతకు బీఎస్ఎఫ్ అధికారులే పూర్తి ఖర్చులతో ముఖ్యమైన ప్రదేశాలు, సినీ, రాజకీయ నేతలను చూపిస్తారు. వీరితో పాటు నలుగురు జవాన్లు ఉంటూ సౌకర్యాలు కల్పిస్తారని జిల్లా బీఎస్ఎఫ్ డీఐజీ ఎస్‌కే సిన్హా, జిల్లా నెహ్రూ యువకేంద్రం సెక్రటరీ సంతోష్ పాత్రో తదితరులు తెలియజేశారు.

## కుమ్మరి చక్రాలు అందజేత



విద్యుత్ కుమ్మరి చక్రాలను అందజేస్తున్న అధికారులు

జయపురం: కొరాపుట్ జిల్లా యంత్రాంగం, ఒరమాస్, ఖాదీ ఇండియాలు సంయుక్తంగా జయపురం సమితి పుప్పుగాం గ్రామంలో నివాసముంటున్న 10 కుమ్మరి కుటుంబాలకు విద్యుత్‌తో నడిచే కుమ్మరి చక్రాలను శుక్రవారం వితరణగా అందజేశారు. ఆ చక్రాలను ఎలా వినియోగించాలో లబ్ధిదారులకు సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బీడీవో రాజీవ్ దాస్ మాట్లాడుతూ ప్రభుత్వం కుమ్మరి సాంప్రదాయ వృత్తిదారుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తోందని తెలియజేశారు. విద్యుత్ కుమ్మరి చక్రాలతో తక్కువ సమయంలో ఎక్కువ వస్తువులు తయారు చేయవచ్చని సూచించారు. భవిష్యత్తులో మరింత మందికి విద్యుత్ కుమ్మరి చక్రాలు సమకూర్చుతామన్నారు. మట్టితో టీ కప్పులు కూడా తయారు చేసి జయపురం, కొరాపుట్ పట్టణాల్లోని రైల్వేస్టేషన్లలో ఉన్నటువంటి దుకాణాలకు సరఫరా చేస్తే పర్యావరణానికి మేలు జరగడంతో పాటు లాభాలు వస్తాయని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం అవసరమైన మార్కెట్ కల్పిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భువనేశ్వర్ కేవీఐసీ విభాగ ప్రభుత్వ డైరెక్టర్ అనూప్ భుయ, ఒరమాస్ అధికారులు పాల్గొన్నారు.

## దసరా వేడుకలకు శ్రీకారం



అంచమాల స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



షోడశ ఉపచార పూజలో పాల్గొన్న భక్తులు

జయపురం: పట్టణంలో దసరా వేడుకలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి శుక్రవారం రాత్రి శ్రీకారం చుట్టారు. ప్రధాన దేవి మా భగవతి మందిరంలో షోడశ ఉపచార పూజలు జరిపి ఆలయ పూజారి నుంచి అంచమాల స్వీకరించారు. అలాగే దక్షిణ కాళీ ఆలయంలోనూ షోడశ ఉపచార పూజలు నిర్వహించారు. మొత్తం 16 రోజుల పాటు దసరా వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాహిణీపతి మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి మా భగవతి మందిరం నుంచి మా విజయ దేవి నగర సంచారం ప్రారంభమవుతుందని వెల్లడించారు. వేడుకలకు రాజుల కాలం నుంచి వివిధ గ్రామాల నుంచి విభిన్న దేవతలు, శైవ, భైరవీ పీఠాల నుంచి 60కి పైగా లాఠీలను ఆహ్వానించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జయపురం దేవదాయ ధర్మాదాయ అధికారి మరియు జయపురం తహసీల్దార్ సుశ్రీ సాగరిక షొడంగి, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, కార్యదర్శి కృష్ణచంద్రదాస్ తదితరులు పాల్గొన్నారు.


### వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమణమూర్తి

రాయగడ: పట్టణంలోని లయన్స్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నంకు చెందిన వైద్యుడు టి.రమణమూర్తి బృందం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులకు పంపిణీ చేశారు. రాయగడ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు వి.భాస్కరరావు, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, ఏవీఎస్ గిరి, లాడి చంద్రశేఖర్, బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 10 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

బరంపురం: గోపాల్‌పూర్ తీరంలో కొద్దిరోజుల నుంచి రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి వివేక్‌నంద స్వాంయి తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి సముద్ర తీరంలోని జెట్టీలో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో గోపాల్‌పూర్ పోలీసులు ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి జూదం అడ్డాపై దాడులు చేపట్టి, 10 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.34 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు, రెండు పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకున్నారు.

## ఐఏఎస్ అధికారుల బదిలీలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఐఏఎస్ క్యాడర్‌లో పునర్వ్యవస్థీకరణను చేపట్టింది. ఎనిమిది మంది అధికారులకు కొత్త నియామకాలు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పాలన మరియు ప్రజాభియోగాల విభాగం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బిష్ణుపద సెఠి సామాజిక భద్రత మరియు వికలాంగుల సాధికారత విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. అతను సాధారణ పాలన మరియు ప్రజాభియోగాల విభాగంలో ఆఫీస్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్లానింగ్ అండ్ కన్వర్జెన్స్ విభాగం ప్రత్యేక కార్యదర్శి భాస్కర్ జ్యోతి శర్మను ల్యాండ్ రికార్డ్స్ అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్‌గా నియమించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు తాగునీరు విభాగం డైరెక్టర్ – కమ్ – అడిషనల్ సెక్రటరీగా ఉన్న బి.పరమేశ్వరన్ కన్సాలిడేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. అరిందమ్ డకువా పారిశుద్ధ్యం, పంచాయతీ రాజ్ మరియు తాగునీటి విభాగం స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ల్యాండ్ రికార్డ్స్ మరియు సెటిల్‌మెంట్ విభాగం కమిషనర్ రాష్ట్ర ఐఏఎస్ కేడర్‌లో ప్రత్యేక కార్యదర్శి పదవికి హోదా మరియు బాధ్యతతో సమానమైనదిగా ప్రకటించడం విశేషం.

అలాగే కమిషనర్, కన్సాలిడేషన్ (భువనేశ్వర్) హోదాకు రాష్ట్ర ఐఏఎస్ కేడర్‌లో అదనపు కార్యదర్శి పదవికి సమానమైన హోదా మరియు బాధ్యతలు పరిగణించబడతాయని ప్రకటించారు. జ్యోతి ప్రకాష్ దాస్ స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రమాషిస్ హజ్రా ఏహెచ్ మరియు వీఎస్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ప్రెసిడెంట్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వులు పేర్కొన్నాయి. అదేవిధంగా ఇంద్రమణి త్రిపాఠిని ఎస్టీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆ నియామకంతో ఎస్టీ మరియు ఎస్సీ, బలహీన, వెనుకబడిన వర్గాల విభాగం అదనపు కార్యదర్శి మరియు ఎస్సీ మరియు ఎస్టీఆర్‌టీఐ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను కేటాయించారు. బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆర్థిక సలహాదారు సుబ్రత్ శతపతికి రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు.

## ‘రైతుల సమస్యలపై గవర్నర్ చర్యలు తీసుకోవాలి’



వినతిపత్రంతో బీజేపీ కృషక్ సెల్ నేతలు

జయపురం: రాష్ట్రంలోని రైతుల సమస్యలపై గవర్నర్ కలుగజేసుకొని చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ కృషక్ సెల్ ఉపాధ్యక్షుడు బిపద రంజన్ దాస్ నేతృత్వంలో నళినీ దాస్, రాధామోహన్ పారిడ, రాము బెహర, అనిల్ కుమార్ నాయక్, బద్రి నారాయణ ఆచారి తదితరులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర గవర్నర్‌ను ఉద్దేశించిన వినతిపత్రం శుక్రవారం అందజేశారు. బీజేడీ పాలనలో వ్యవసాయానికి, రైతులకు ఎటువంటి ప్రాధాన్యత లేదని ఆరోపించారు. వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్‌తో దర్యాప్తు జరిపించాలని కోరారు. మండీలలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మండీలలో ధాన్యం కొనుగోలులో ఒక రాకెట్ పని చేస్తోందని, ఈ రాకెట్‌లో కింద స్థాయి నుంచి మంత్రుల వరకు ఉన్నారని ఆరోపించారు. వాటిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరారు. రసాయనిక ఎరువులపై కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రైతులకు దక్కడం లేదన్నారు. 2019 నుంచి 2021 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కరువు ఏర్పడిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ దళారులు బీమా కంపెనీలతో కలిసి కుట్రలు చేయడం వలన రైతులు పంటల బీమా పొందలేకపోతున్నారని దుయ్యబట్టారు. అందువలన రైతుల సమస్యలపై కలుగజేసుకొని వారికి న్యాయం చేయాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

## క్లుప్తంగా

### పాము కాటుతో మహిళ మృతి


నీలాపు మీన (ఫైల్)

గార: కళింగపట్నం పంచాయతీ సిలగాం కాలనీకి చెందిన నీలాపు మీన (35) అనే మహిళ పాము కాటుకు గురై మృతి చెందారు. ఆమె ఆదివారం సాయంత్రం ఇంటి వెనుక పొలాల్లోకి వెళ్లగా అక్కడే పాము కాటేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు పరిశీలించేసరికే మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### అదృశ్యమైన వృద్ధురాలు మృతి

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వెనుక భాగంలో ఆదివారం ఉదయం ఒక వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతురాలు కొత్తమ్మతల్లి వీధికి చెందిన కురమాన అమ్మన్నమ్మ(75)గా గుర్తించారు. మృతురాలికి మతి స్థిమితం సరిగా ఉండదు. శనివారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటి నుంచి వృద్ధురాలి గురించి గాలిస్తున్న సమయంలో ఇలా చనిపోయి కనిపించింది. ఒంటిపై ఎలాంటి గాయాల ఆనవాళ్లు లేకపోవడంతో సహజ మరణంగా గుర్తించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు.

### సారా స్థావరాలపై దాడులు


సారా తయారీకి వినియోగించిన సామగ్రి, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: సారా నిర్మూలనే ధ్యేయంగా ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ కార్యక్రమం ద్వారా సారా తయారు చేసే స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నామని పాతపట్నం సీఐ ఎం.వినోద్ బాబు అన్నారు. అందులో భాగంగానే ముందస్తు సమాచారం మేరకు మండలంలోని సవర మర్రిపాడు గ్రామంలో టెక్కలి ఎస్టీఎఫ్ఆర్‌టీ బృందాలతో కలసి దాడులు చేశామని తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ దాడుల్లో 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 50 లీటర్ల నాటుసారా, సారా తయారీకి వినియోగించిన సామగ్రి, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత నాటుసారా తయారీ, క్రయవిక్రయాలు నిర్వహిస్తున్న పెద్దింటి నూకరాజు, పెద్దింటి వెంకటరమణలను అరెస్ట్ చేశామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా.. తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ పలువురు సిబ్బంది ఉన్నారు.

### 'ఆప్షన్లు ఇచ్చిన కళాశాలలో సీట్లు రాలేదు'

ఎచ్చెర్ల క్యాంపస్: పీజీ సెట్-2023 ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి మొదటి ప్రాధాన్యత ఇస్తే ఇతర వర్సిటీ, కళాశాలల్లో సీట్లు వచ్చాయని కొందరు విద్యార్థులు వర్సిటీ అధికారులకు తెలిపారు. ఈ మేరకు పీజీ సెట్ కన్వీనర్, ఆంధ్రావిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సీహెచ్‌వీవీఎస్ భాస్కర్‌రెడ్డి దృష్టికి స్థానిక అధికారులు తీసుకు వెళ్లారు. రెండో కౌన్సెలింగ్‌లో విద్యార్థులు మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకోవాలని కన్వీనర్ సూచించారు. సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తామని అన్నారు.

### 'సంఘటితంగా పోరాడదాం'


కాశీబుగ్గలో ప్రగతిశీల మహిళా సంఘ తరగతులకు హాజరైన మహిళలు

కాశీబుగ్గ,పలాస: స్త్రీ, పురుష సమానత్వం కోసం మహిళలు సమైక్యంగా ఉద్యమించాలని స్త్రీలపై జరుగుతున్న లైంగికదాడులు, వివక్ష అణచివేతలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.విష్ణు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలోని గణపతి రెసిడెన్సీలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్లమెంటులో ఉండిపోయిన ఫైళ్లను ప్రధాని మోదీ ఆమోదించారే తప్ప మహిళల విముక్తి కోసం కాదన్నారు. ఇది మహిళల కన్నీటి తుడుపు చర్య మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.పద్మ అన్నారు. మణిపూర్‌లో కుకీజాతి మహిళలని నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్యలు చేసినా నోరు మెదపలేదని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చి కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఆదివాసీల అడవులను వనరులను సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేందుకు అటవీ సంరక్షణ చట్టం -2023 తీసుకొచ్చారని ఆరోపించారు. అంతకు ముందు అమరులైన పంచాది నిర్మల, సరస్వతి అంకమ్మ, స్నేహలత, చిట్టెమ్మ, పారమ్మ, కామ్రేడ్ చంద్రమ్మ, జయక్క తదితరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సహాయ కార్యదర్శి శీలం ఏసమ్మ, రాష్ట్ర నాయకులు బి.ఈశ్వరి, చిలకమ్మ, శాంతి, రమ, కల్పన, మంజుల, వసంతమ్మ పాల్గొన్నారు.


రాయగడ: సైకిల్ రేస్ ప్రారంభిస్తున్న ఎస్పీ పాత్రో


రాయగడ: బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న బాలికలు


జయపురంలో సైబర్ మారథాన్ ప్రారంభిస్తున్న చైర్మన్ నరేంద్ర మహంతి


మల్కన్‌గిరి: జెండా ఊపి మారథాన్ ప్రారంభిస్తున్న దృశ్యం


బరంపురం: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఐజీ సత్యబ్రత బోయి తదితరులు

జయపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండడానికి కొరాపుట్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ సేఫ్టీ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం 5.30 గంటలకు జయపురం విక్రమదేవ్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానం నుంచి సైబర్ మారథాన్ ప్రారంభమై ట్రాఫిక్ కూడలి, రాజానగర్, తరణి కూడలి, పంచానన మందిర్, క్రిస్టియన్‌పేట మీదుగా మరలా విశ్వవిద్యాలయ మైదానానికి చేరుకుంది. జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి పచ్చజెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బీసీ, పట్టణ పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉదయం 7.30 గంటలకు సైక్లోతన్ ప్రారంభమైంది. దీనిలో భాగంగా అనేక మంది సైకిల్‌పై ర్యాలీ నిర్వహించి, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే పోలీసులు ఏర్పాటు చేసిన సైబర్ రథ్ వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలను సైబర్ నేరాలపై అప్రమత్తం చేసింది. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అలాగే బొయిపరిగుడలో పోలీసు అధికారి సుశాంత కుమార్ శతపతి నేతృత్వంలో సైబర్ సురక్షా అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీడీవో అభిమన్య కవి శతపతి, జిల్లా పరిషత్ సభ్యురాలు రాజేశ్వరి మహారియ తదితరులు పాల్గొన్నారు.

**5కే ర్యాలీ**

బరంపురం: పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఆదివారం 5కే ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ సార్వణ్ వివేక్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని దక్షిణాంచల్ రేంజ్ పోలీసు ఐజీ సత్యబ్రత బోయి ప్రారంభించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ.. అప్రమత్తతే సైబర్ నేరాలకు మందు అన్నారు. స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, కొమ్మాపల్లి జంక్షన్, ఇంజినీర్ స్కూల్, ఐటీఐ మైదానం వరకు కొనసాగింది. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక జిల్లా పోలీసు కేంద్రం నుంచి సైబర్ సేఫ్టీపై అవగాహన మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్స్ బారినపడకుండా ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దేభద్ర ప్రధాన్, మల్కన్‌గిరి అదనపు ఎస్పీ నారాయణ్ రాథో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి సైకిల్ రేస్‌ను ఆదివారం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో ముఖ్య అతిథిగా హాజరై పచ్చజెండా ఊపి రేసును ప్రారంభించారు. అనంతరం రేసులో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.డెహూరి, ఎస్డీపీవో రష్మి రంజన్ సేనాపతి, జిల్లా క్రీడా శాఖ అధికారి షేక్ అలీనూర్ తదితరులు పాల్గొన్నారు.


జయపురం: బొయిపరిగుడలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


జయపురం: సైబర్ రథ్‌తో ముచ్చింగ్‌పుట్ ఆదర్శ విద్యాలయంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



జయపురం: సైబర్ క్రైమ్స్‌పై మాట్లాడుతున్న పోలీసు అధికారి


జయపురం: సైబర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న పట్టణ యువత

# బహు రూపాల్లో శక్తి స్వరూపిణి


భువనేశ్వరి అలంకరణలో కటక్ చండీమాత


పూరీ చార నారాయణి అమ్మవారి భువనేశ్వరి అలంకరణ


కమల స్వరూపంలో కటక్ గొడొ చండీమాత


పితాపూర్ ధకులై మాత భువనేశ్వరి స్వరూపం


గాయత్రి అలంకరణలో కటక్ చవులియా గంజ్ జయదుర్గ మాత

షోడశ దిన్మాతక పూజలు పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ శక్తి పీఠాల్లో ఆరాధ్య దేవతలు బహు రూపాల్లో ఆదివారం దర్శనమిచ్చారు. పలు అంకరణల్లో ఉన్న దేవీ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– భువనేశ్వర్

## • సైకత శుభాకాంక్షలు




ఆసియా క్రీడల్లో ఈసారి భారత్ 100కు పైగా పతకాలు సాధించింది. దీంతో ఈ ఆనందాన్ని సైకత శిల్పం రూపంలో ప్రదర్శించాడు అంతర్జాతీయ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్. ఇస్ బార్ 100 పార్ (ఈసారి 100 అధిగమించారు) నినాదంతో రూపు దిద్దుకున్న ఈ శిల్పం పూరీ సాగర తీరంలో సందర్శకులు, పర్యాటకుల దృష్టిని విశేషంగా ఆకట్టుకుంటుంది.

– భువనేశ్వర్/పూరీ

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న మీనాకుమారి

మీనాకుమారి (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: అత్తమామల వేధింపులు ఓ నిండు ప్రాణాన్ని బలికొన్నాయి. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన పైలా తులసయ్య, మోహినీల కుమార్తె నీలాపు మీనాకుమారి(22)ని ఏడేళ్ల కిందట అదే మండలం నీలాపుపుట్టుగ గ్రామానికి చెందిన నీలాపు మోహన్ బాబుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఐదేళ్ల బాబు తులసీదాసు, రెండున్నరేళ్ల పాప ధనుశ్రీలు ఉన్నారు. ఏడు నెలల కిందట భర్త మోహన్‌బాబు విదేశాలకు వలస వెళ్లిపోవడంతో కుటుంబంలో కలహాలు మొదలైనట్లు మృతురాలి తల్లిదండ్రులు చెబుతున్నారు. మామ జగ్గారావు, అత్త అన్నపూర్ణలు ప్రతి రోజు తమ కుమార్తెతో గొడవలకు దిగడంతో పలుమార్లు సర్ది చెప్పినట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం మరోమారు గొడవ కావడంతో మీనాకుమారి సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటిలోనే ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు తమ బిడ్డ చావుకు అత్తింటి వారే కారణమంటూ గ్రామంలో పెద్దలతో పంచాయతీ పెట్టారు. తమ కోడలు కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని అత్తామామలు పంచాయతీలో చెప్పడంతో ఇరు కుటుంబాల మ ధ్య రాజీ కుదరలేదు, మృతురాలి తల్లి పైలా మోహిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీమ్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్న ఇంటిని పరిశీలించింది. అనంతరం మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

## ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ ఎంపికలు


హ్యాండ్‌బాల్ జట్ల క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా జూనియర్స్ బాలురు, సీనియర్స్ మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగాయి. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఎంపికై న క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని కృష్ణకుమార్, చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలురు, సీనియర్స్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శేఖర్, గురుగుబెల్లి రాజశేఖర్, హరీష్‌రాయుడు, ఈశ్వరరావు, ఢిల్లేశ్వరరావు, కనకసుందర్, కోచ్‌లు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పేకాట శిబిరంపై పోలీసుల దాడి



పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై వీరజనార్దన్, పోలీసులు

కొత్తవలస: మండలంలోని రాజపాత్రునిపాలెం గ్రామం సమీపంలో ఒక ఇంటి వద్ద రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై వీర జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.38,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### 700 క్యూసెక్కుల సాగునీరు సరఫరా



కాలువ ద్వారా సరఫరా చేస్తున్న సాగునీరు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు 700 క్యూసెక్కుల సాగునీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రేగిడి, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు మండలాల్లో సాగునీటి అవసరం నెలకొంది. దీంతో కుడి ప్రధాన కాలువ ద్వారా పూర్తి సామర్థ్యంతో సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రాజెక్టులోకి వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని, ఒక్క గేటు ఎత్తి 660 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్లు ఏఈ నితిన్ చెప్పారు.

### ఆగి ఉన్న బస్సును ఢీకొన్న మరో బస్సు



షికారుగంజి కూడలి వద్ద పొలాల్లోకి వెళ్లిన బస్సు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద శనివారం రాత్రి ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును మరో బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో వెనుక బస్సులో ఉన్న డ్రైవర్ క్లీనర్‌కు స్వల్ప గాయాలైనట్లు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించడం కోసం షికారుగంజి కూడలి వద్ద ఆగింది. అదే సమయంలో పార్వతీపురం వెళ్తున్న మరో బస్సు ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ముందు బస్సు పొలాల్లోకి వెళ్లి పోయింది. వెనుక బస్సులో ఉన్న డ్రైవర్ క్లీనర్‌కు గాయాలవడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. రెండు బస్సులు పార్వతీపురం డిపోకు చెందినవి కావడంతో ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

### తండ్రీకొడుకులకు గాయాలు



క్షతగాత్రులను 108వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

జామి: మండలంలోని జామి గోస్తనీనదిపై వంతెన సమీపంలో ఉన్న మలుపువద్ద జరిగిన ఆటో ఢీకొట్టడంతో తండ్రీ కొడుకులు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఎల్.కోట మండలం గేదెల వానిపాలెం గ్రామానికి చెందిన ఎం.పైడింనాయుడు(58), కుమారుడు శ్రీను(28) కొట్టాం కోటమ్మ తల్లిని దర్శించుకుని టీవీఎస్ ఎక్సెల్ బండిపై తిరిగి గ్రామానికి వస్తున్న సమయంలో జామి వంతెన మలుపు వద్ద జామినుంచి కొట్టాం వెళ్తున్న ఆటో ఎదురుగా రావడంతో ఢీకొట్టడంతో గాయాపాలయ్యారు. ఈ సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి వారిని విజయనగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి తండ్రి పైడినాయుడిని మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం


బొబ్బిలి: పట్టణంలోని పూల్‌బాగ్‌లో గల జంగాల శివాలయం సమీపంలో ఓ చెట్టును అటుగా వెళ్తున్న పొక్లెయినర్ ఢీ కొట్టి ఒరిగిపోయింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా పొక్లెయినర్ రాసుకుంటూ వెళ్లడంతో షార్ట్ సర్క్యూట్ అయి పెద్ద శబ్దాలు వచ్చాయి. అయితే అదృష్ట వశాత్తు ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# 'తోకలేని పిట్ట' కొత్త పరుగు

- కాలంతో పాటు కొత్తసేవలు
- పోస్ట్ ఇన్ఫో యాప్ ఏర్పాటు
- క్షణాల్లో డిజిటల్ సమాచారం
- నేడు తపాలా దినోత్సవం




ఇండియన్ పోస్టల్ శాఖ




పోస్టల్ శాఖకు డిజిటల్ సమాచారం

రాజాం: ఆధునిక సాంకేతికతను తపాలాశాఖ అందిపుచ్చుకుంటోంది. 1874లో ప్రారంభమైన పోస్టల్ వ్యవస్థ ప్రపంచంలో తక్కువ సమయంలో ప్రజలు మెచ్చుకునే అతిపెద్ద వ్యవస్థగా మారింది. తోకలేని పిట్ట పేరుతో ఉత్తరాల స్థాయి నుంచి నేడు డిజిటల్ వ్యవస్థ వరకూ కాలంతో పాటు పరుగులు పెడుతూనే ఉంది. ఒక్కప్పుడు ఉత్తరాలకు మాత్రమే పరిమితమైన పోస్టల్ శాఖ కాలానికనుగుణంగా తన సేవలు విస్తృతం చేస్తూ ప్రజల్లోకి వెళ్తోంది. సమాచార సాంకేతికత రోజురోజుకూ పెరుగుతుండడంతో పోస్టల్ శాఖ కూడా కొత్తకొత్త పద్ధతులు అవలంబిస్తోంది. మార్కెట్‌లోకి వచ్చిన ప్రతి సేవనూ తాము కూడా అందిస్తామని ముందుకొస్తోంది. విజయనగరి జిల్లాలో 34 ఎస్‌ఓ కార్యాలయాల ద్వారా సేవలు అందిస్తున్న పోస్టల్ శాఖ పరిధిలో 600 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నేడు ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా కథనం.

**ఆధార్‌తో పాటు అనుబంధ సేవలు**

పోస్టల్ శాఖలో అన్నిరకాల నూతన సేవలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆధార్ సేవలు పలు ఆర్‌ఓ కార్యాలయాల వద్ద ప్రారంభించారు. కొత్తగా ఆధార్ కావాలన్నా, పేర్లు మార్పు చేయాలన్నా ఈ సేవలు పోస్టల్ కార్యాలయాల్లో అందుతున్నాయి. నిత్యవసరమైన రిజిస్ట్రేషన్ స్టాంప్‌ల విక్రయాలు పోస్టల్‌శాఖ ప్రారంభించింది. రూ.10నుంచి రూ.100 విలువచేసే స్టాంప్ పత్రాలు పోస్టల్‌శాఖలోని అన్ని ఎస్‌ఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచింది. ఇవే కాకుండా పాస్‌పోర్టు దరఖాస్తులు, సుకన్య సమృద్ధియోజన స్కీమ్, సేవింగ్స్ డిపాజిట్స్ వంటి అధునాతన పథకాలను అమలుచేస్తోంది. మిగిలిన సేవా సంస్థలకు దీటుగా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

**కొత్తగా డిజిటల్ యాప్**

కొత్తగా పోస్ట్ ఇన్ఫో యాప్‌ను పోస్టల్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే క్షణాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయి. తొమ్మిదిరకాల సేవలను ఈ యాప్ ఆధారంగా పొందవచ్చు. సుకన్య సమృద్ధి యోజన పథకం, రికరింగ్ డిపాజిట్ పథకం తదితర వివరాలను తెలుసుకోవచ్చు. ఇంట్రస్ట్ కాలిక్యులేటర్, ఆర్టికల్ ట్రాకింగ్, సర్వీస్ రిక్వెస్ట్, కంప్లైంట్స్ ట్రాకింగ్, ఇన్సూరెన్స్ పోర్టల్, ఫీడ్‌బ్యాక్, పోస్టేజ్ కాలిక్యులేటర్, పోస్టల్ ఆఫీస్ సెర్చ్ వంటి వివరాలు ఇందులో ఇమిడి ఉన్నాయి.



ఈ స్టాంప్ పేపర్లు కూడా పోస్టల్‌లోనే

వీటితో పాటు పోస్టల్ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారం, ట్రాక్ వివరాలు కూడా తెలుసుకునే వీలుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ సేవల్లో నాణ్యత, నవీనత పెరిగింది. ప్రత్యేక డిజిటల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆధార్ ప్రక్రియ, రిజిస్ట్రేషన్ స్టాంప్‌ల క్రయం, కొత్తగా అధికవడ్డీ డిపాజిట్ స్కీమ్‌లు పోస్టల్ శాఖలో అందుబాటులో ఉండడంతో ఈ సేవలు విస్తృతమయ్యాయని, ప్రజలు పోస్టల్ సేవలను ఆదరిస్తున్నారని రాజాం ఎస్‌ఓ ప్రభాకరరావు తెలిపారు.



రాజాంలో పోస్టల్ శాఖ కార్యాలయం

**ఇప్పటికీ పోస్టల్ సేవలే..**



నేను ఇప్పటికీ పోస్టల్ సేవలనే వినియోగిస్తున్నాను. ఏవైనా రచనలు, విశ్లేషణలు, పత్రికా వ్యాసాలు పోస్టల్ ద్వారానే ముద్రణ సంస్థల అడ్రస్‌కు పంపిస్తుంటాను. నాకు వచ్చే పారితోషకాలు, పురస్కారాలు, ప్రశంసాపత్రాలు పోస్టల్ ద్వారానే అందుతుంటాయి. పోస్టల్ సేవల్లో గోప్యత ఉంటుంది.

గార రంగనాథం,
రాజాం రచయితలవేదిక అధ్యక్షుడు

**విలువైన సేవలు**



పోస్టల్ ద్వారా విలువైన సేవలు అందుతుంటాయి. మనం చేరవేసే సమాచారం చేరాలనుకునే వ్యక్తికి చేరుతుంది. ఈ సమాచారంలో గోప్యత, భద్రత ఉంటుంది. ఇప్పుడు టెక్నాలజీ మరింత విస్తృతంగా పెరిగి, అన్ని సేవలూ అందుతున్నాయి. ఇప్పటికీ పోస్టల్ శాఖ సేవలు వినియోగిస్తుంటాను.

షేక్ హుస్సేన్,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజాం

# ఆరోగ్య భద్రతకు ఆరోగ్య హక్కు చట్టం చేయాలి

- జనవిజ్ఞాన వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్




మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు

విజయనగరం అర్బన్: ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం చేయాలని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సంయుక్త నిర్వహణలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు ఈ మేరకు కోరారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ 1948లో ప్రకటించిన మానవ హక్కుల చార్టర్ (యూనివర్సల్ డిక్లరేషన్) మనిషి గౌరవప్రదమైన జీవితం జీవించే హక్కులో ఆరోగ్యం ఒక భాగమని పేర్కొన్నట్లు తెలిపారు. 1966లో జరిగిన అంతర్జాతీయ ఒప్పందం ఆరోగ్యం పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తించిందన్నారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 21 పౌరునికి జీవించే హక్కును కల్పించడమే కాకుండా జీవించడం అంటే కేవలం ఏదో విధంగా జీవించడం కాదని ఆరోగ్యవంతమైన గౌరవప్రదమైన జీవితంగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశించిందన్నారు. కాబట్టి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలననుసరించి దేశపౌరుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని, అందుకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రజారోగ్య హక్కు చట్టం ఆవశ్యకతపై తీర్మానించి భవిష్యత్ కార్యాచరణ ప్రవేశపెట్టారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు, ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జె.మురళి, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ఎస్‌మూర్తి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.శ్యామ్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుధారాణి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంబాబు, ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు, మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ ప్రతినిధి సూర్యభగవాన్, సమతా రాష్ట్ర కన్వీనర్ నిర్మల, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, మురళి బాబు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని తీర్మానాన్ని ఆమోదించారు.

# రామతీర్థంలో ధర్మ ప్రచార వారోత్సవాలు



రామతీర్థంలో శ్రీమద్రామాయణంపై ప్రవచిస్తున్న కృష్ణమాచార్యులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ధర్మ ప్రచార వారోత్సవాలకు దేవాదాయశాఖ శ్రీకారం చుట్టింది. హిందూ ధర్మం గొప్పతనం, సంస్కృతి, సంప్రదాయాలను వివరించేందుకు ఆదివారం నుంచి ఈ నెల 14వరకు వారోత్సవాలు కొనసాగనున్నాయి. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు విజయనగరానికి చెందిన ప్రవచన కర్త కృష్ణమాచార్యులు శ్రీమద్రామాయణంపై ప్రవచించారు. 9న భీష్మారావు భక్తి సంగీత బృందం ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనల ఆలాపన, 10న తంగుడుబిల్లి కళాకారులతో కోలాటం ప్రదర్శన, 11న వైష్ణవి కళాక్షేత్రం బృందం ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన, 12న మొయిద గ్రామానికి చెందిన పైడిరాజు బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, 13న కాళ్ల నిర్మల ఆధ్వర్యంలో రుక్మిణీ కల్యాణం హరికథ, 14న శ్రీరామకల్యాణంపై బుర్రకథ కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు ఈఓ కిశోర్‌కుమార్ తెలిపారు. భక్తులు హాజరై కార్యక్ర మాలను విజయవంతం చేయాలని కోరారు.

# డ్వాక్రా మహిళల్లో మీమాంస..!

- బ్యాంకులో రుణ మొత్తం చెల్లించాలా? అని ఆందోళన

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు మీమాంసలో పడ్డారు. తమకు తెలియకుండా బ్యాంకులో రుణాలు వాడుకున్న ఆర్పీల అక్రమాలను అధికారులు ప్రాథమికంగా రూ.68 లక్షలుగా వెలుగులోకి తీసుకువచ్చారు. అయితే వారు వాడుకున్న మొత్తానికి తమకు తెలియకుండానే కొంత మేర తమతో కట్టించగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకులో కట్టాలా? వద్దా? అని మథనపడుతున్నారు. సమ్మినందుకు ప్రతి గ్రూపు నుంచి లక్షల రూపాయల మేర ఆర్పీలు వారి సొంతానికి వాడుకుని తమను నట్టేట ముంచారని వాపోతున్నారు. పూర్తిస్థాయిలో వారి నుంచి సొమ్ము రికవరీ చేయించడమే కాకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ నెలకు సంబంధించి పొదుపు, లోన్ల మొత్తాలను బ్యాంకులో కడితే ఏమవుతుంది? కట్టకపోతే ఏం జరుగుతుందనే ఆందోళనలో ఉన్నారు. ఆర్పీలు, బ్యాంకు సిబ్బంది కలిసి చేసిన తప్పిదానికి తామంతా ఇబ్బంది పడాల్సిందేనా అంటూ మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఇటీవల చేపట్టిన దర్యాప్తు రిపోర్టులను జిల్లా పీడీ కార్యాలయానికి ఈ నెల 9న సమర్పించిన అనంతరం గ్రూపుల వారీగా ఎంత మొత్తం వాడుకున్నారనేది తెలియనుందని మెప్మా అధికారులు వెల్లడించారు.

# పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన మురళి

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం అంటివలస గ్రామానికి చెందిన మెళ్లకు మురళి(36) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై జిలా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మురళి శనివారం రాత్రి పురుగు మందు తాగి ఇంటి వద్ద పడి ఉండడాన్ని గమనించిన కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

**నాగావళిలో వృద్ధుడి మృతదేహం**



నది వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆర్.జనార్దన రావు

వంగర: మండల పరిధి ఓని అగ్రహారం గ్రామ సమీపంలో నాగావళి నదిలో వృద్ధుడు మృతదేహం ఆదివారం వంగర పోలీసులకు లభ్యమైంది. దీనిపై ఎస్సై ఆర్.జనార్దనరావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చిదిమి గ్రామానికి చెందిన రౌతు నర్సింహులు (87) ఈ నెల 4వ తేదీన వట్టిగెడ్డ వైపు బహిర్భూమికి వెళ్లాడని, అప్పటి నుంచి కనిపించలేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో నాలుగు రోజుల పాటు పోలీసులు గాలించగా ఓని అగ్రహారం వద్ద నాగావళి నది సమీపంలో శవమై కనిపించాడు. ఈ సమాచారం కుటుంబసభ్యులకు తెలియజేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### 9 మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం: మండలంలోని పురిటి పెంట న్యూకాలనీకి చెందిన సుంకరి రాంబాబు 9మద్యం సీసాలను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై గంగరాజు ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ మద్యం,పేకాట, కోడిపందాలు, గంజాయి రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు.

### బొలెరో సీజ్

గజపతినగరం: మెంటాడ మండల కేంద్రానికి చెందిన హరి సతీష్ 9 పశువులను అలమండ సంతలో విక్రయించేందుకు గజపతినగరం మీదుగా బొలెరో వాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. మూగజీవాలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.

### పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలసలో ఆదివారం ఉదయం పిచ్చికుక్క ఆరుగురిని గాయపర్చింది. పిచ్చికుక్క దాడిలో గ్రామస్తులు తామాడ శ్రీనివాసరావు, వాకాడ స్వామినాయుడు, భీమారావు, శ్రీనివాసరావు, పళ్ల సత్యం, మరడ శంకరరావు, గుణుపూరు గోవిందనాయుడులు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. వారందరినీ రావివలస పీహెచ్‌సీకి తరలించారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి విషమించడంతో పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

### నవంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర



డీఎస్‌డీఓ ఎస్ వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నవంబరు 15 నుంచి డిసెంబరు 21వ తేదీ వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగుతుందని డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వర రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన క్రీడా సామాగ్రి జిల్లా కేంద్రానికి చేరుకుందని తెలిపారు. ఫిట్ ఆంధ్రా ధ్యేయంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామం, ప్రాంతంలో గల స్థానిక క్రీడలతో సహా మూడు కిలోమీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి క్రీడలు, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. క్రీడలలో పాల్గొనదలచిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

# హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



సెమీఫైనల్లో తలపడుతున్న శ్రీకాకుళం - విజయనగరం జిల్లాల బాలుర జట్లు

- ఫైనల్‌కు చేరుకున్న గుంటూరు, విజయనగరం జట్లు

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరులో రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బాలికల విభాగంలో గుంటూరు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు - ప్రకాశం జిల్లాలు తలపడగా ప్రకాశం జిల్లాను ఓడించి గుంటూరు ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో శ్రీకాకుళం - విజయనగరం జిల్లాల మధ్య మొదటి సెమీ ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో విజయనగరం శ్రీకాకుళం జిల్లాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. సోమవారం బాలికల విభాగంలో చిత్తూరు - కడప జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఫైనల్లో గుంటూరు జిల్లాతో తలపడనుంది. అదే విధంగా బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి - అనంతపురం జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో విజయనగరం జిల్లాతో ఆడనుంది.

**క్రీడాస్ఫూర్తితో ఆడాలి**

గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ ఎక్స్‌పర్ట్ షామీర్ బాషా అన్నారు. ఆదివారం ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి తర్వాత దేశానికి ప్రాతినిథ్యం వహించి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు షామీర్‌బాషాను సత్కరించారు.

## ఏకపక్షంగా అండర్-19
# మహిళా క్రికెట్ పోటీలు

- మధ్యప్రదేశ్, అసోం, కేరళ జట్ల విజయం



బీహార్ -అసోం జట్ల మధ్య జరుగుతున్న పోటీ

విజయనగరం రూరల్: భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో గ్రూప్-ఈ విభాగంలో ఆదివారం ప్రారంభమైన అంతర్ రాష్ట్ర అండర్- 19 మహిళల వన్డే క్రికెట్ పోటీలు ఏకపక్షంగా సాగాయి. చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో బరోడా, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా జట్టు 47.4 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌట్ కాగా, 117 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన మధ్యప్రదేశ్ జట్టు 36.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. విజయనగరం జిల్లా కేంద్రం శివారు సర్ విజ్జీ క్రికెట్ మైదానంలో బీహార్, అసోం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు 33.4 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌట్ కాగా, 119 విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అసోం జట్టు బ్యాటర్లు 28 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి విజయం సాధించారు. దాకమర్రి సమీపంలోని కందుకూరి క్రికెట్ మైదానంలో మిజోరం, కేరళ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో స్వల్ప స్కోర్లు నమోదయ్యాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన మిజోరం జట్టు 34.4 ఓవర్లలో 53 పరుగులే సాధించి ఆలౌట్ కాగా, స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా విజయదుందుభి మోగించింది.

# పైడితల్లి పండగ ఆరంభం



ప్రత్యేక అలంకరణలో సిరిమాను చెట్టు

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ ఆరంభమైంది. అత్యంత కీలకమైన సిరిమాను ఘట్టానికి అవసరమయ్యే చింత చెట్టును నెల్లిమర్ల మండలంలోని జరజాపుపేటలో గుర్తించారు. ఈ చెట్టుకు ఆలయ అధికారులు, పూజారులు స్థానిక పెద్దలు ఆదివారం బొట్టు పెట్టి పూజలు నిర్వహించారు. తుమ్మి అప్పారావు కుటుంబానికి చెందిన కల్లంలో ఈ చెట్టును గుర్తించారు. దీంతో అమ్మవారు తమను, తమ గ్రామాన్ని కరుణించారని ఆ కుటుంబ సభ్యులు తుమ్మి వెంకటరమణ, వెంకటలక్ష్మి, సన్యాసిరావు, సంధ్య, అశోక్ ఆనందపడుతున్నారు. జరజాపుపేటలో సిరిమాను చెట్టు ఉందని అమ్మవారు ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు కలలోకి వచ్చి చెప్పడంతో చెట్టును గుర్తించామని పైడితల్లి అమ్మవారి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధారాణి తెలిపారు. ఈ నెల 15వ తేదీన ఈ చెట్టుకు పూజలు చేసి సిరిమానుగా రూపొందించేందుకు విజయనగరంలోని హుకుంపేటకు తరలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పూర్వజన్మ సుకృతం**

పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును మా కల్లంలో కోరడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. అమ్మవారి కరుణాకటాక్షాలు మాపై, మా గ్రామంపై ఉండాలని మనసారా కోరుకుంటున్నాము.

– తుమ్మి వెంకటరావు, సిరిమాను కల్లం యజమాని, జరజాపుపేట